క్లుప్తంగా

ధ్వజస్తంభం ఏర్పాటుకు సన్నాహాలు



పూజలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా చెట్టును వేద పండితుల మంత్రోచ్ఛరణలు, సన్నాయిమేళంతో పురవీధుల్లో శుక్రవారం ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు.


మెగా ఫాగింగ్



71వ వార్డులో వాహనంతో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 71వ వార్డులో మెగా ఫాగింగ్ నిర్వహించారు. శుక్రవారం జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏఎంవోహెచ్ పర్యవేక్షణలో పలు వీధుల్లో ఫాగింగ్ చేశారు. దోమల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు జెడ్సీ శేషాద్రి తెలిపారు. జోన్ పరిధిలో రోజుకో వార్డు చొప్పున మెగా ఫాగింగ్ చేస్తామన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

'సీఆర్ఏఎఫ్'కు పూర్తి అనుమతులివ్వాలి

మద్దిలపాలెం: రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం గతేడాది స్థాపించిన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం(సీఆర్ఏఎఫ్) సంస్థ తన కార్యకలాపాలను విస్తృత పరచడంలో ప్రభుత్వ పూర్తి అనుమతులు జారీ చేయాలని ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి అనుమతులు జారీ చేసేలా దరఖాస్తు చేశామని శుక్రవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. రాష్ట్ర విద్య, స్త్రీ, శిశు సంక్షేమ, కార్మిక సంక్షేమ, సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వైద్య, ఆరోగ్య, హోం , దేవదాయ శాఖలతోపాటు మరిన్ని శాఖలకు దరఖాస్తు చేశామన్నారు. ప్రధానంగా బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించాలన్నదే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ కళాశాలలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ శాఖల వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనకు అనుమతివ్వాలని కోరారు. ఫోరం తరఫున రూపొందించిచే వివిధ బాలల చట్టాలు, హక్కులపై అవగాహన పెంపొందించే పోస్టర్లు, స్టిక్కర్లు, వీడియో క్లిప్పింగ్స్, ప్రసార, సోషల్ మీడియాలో ప్రచారం చేయనున్నామని తెలిపారు. కాపీరైట్ చట్టాలను అనుసరించి తక్షణ చట్ట ప్రకారం చర్యలకు ప్రత్యేక అనుమతులు కోరుతూ రాష్ట్ర హోం శాఖ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేశామన్నారు. అనుమతులు రాగానే తమ చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం విస్తృత స్థాయిలో పిల్లల సేవలు అందించనున్నట్టు ధనలక్ష్మి, ప్రవీణలు పేర్కొన్నారు.



ఆక్రమణలకు గురైన గెడ్డ



గెడ్డ పాత చిత్రం

జీ హుజూర్!




కూర్మన్నపాలెం: కూటమి నేతలకు కొంతమంది అధికారులు దాసోహమైపోతున్నారు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఫిర్యాదులను సైతం బుట్ట దాఖలు చేస్తున్నారు. చివరకు మరో విభాగం అధికారులు రాసిన లేఖలను కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. ఇందుకు వడ్లపూడి గెడ్డ నిర్మాణ పనులు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఇదీ విషయం

జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సమీపంలోని చాకలి వీధి మీదుగా(ముస్లింవీధి) పవన్‌సాయి ఆస్పత్రి నుంచి హైవే వరకు విశాలమైన గెడ్డ ఉంది. అయితే భారీ వర్షాల సమయంలో వరదనీరు ఉప్పొంగి పరిసర వాసులు ఇబ్బంది పడడంతో గెడ్డ ఆధునికీకరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 2.80 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత కూటమి ప్రభుత్వం రావడంతో టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. గెడ్డ ప్రాంతంలో ఆక్రమణలు జోలికి వెళ్లకుండా పనులు చేపట్టాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అయితే దీనిపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. ఇది గ్రహించిన ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు గెడ్డ తగ్గడం వల్ల భవిష్యత్తులో ప్రమాదం ఉందని ఇంజినీరింగ్ విభాగానికి ఫిర్యాదు చేశారు. అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో గెడ్డ ఆక్రమణలు గుర్తించి తొలగించాలని ప్రణాళికా విభాగానికి నాలుగు నెలల కిందట లేఖ రాశారు. ఆ లేఖను పట్టించుకోలేదు సరికదా తమకు అందలేదని అసిస్టెంట్ సిటీ ప్లానర్ వెంకటరావు అధికారికంగా వెల్లడించారు.

లేఖ తేదీలు వెల్లడించిన ఈఈ

ఇదే విషయాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ఆర్.. ఎస్. అప్పారావు వద్ద ప్రస్తావించగా లేఖలు రాసిన తేదీ వివరాలను కూడా వివరించారు. తాజాగా ఈ నెల 14వ తేదీన మరో లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. దీన్ని బట్టి చూస్తే అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం అధికార పార్టీకి చెందిన అక్రమార్కులను రక్షించడానికే అధికారులు దోబుచులాడుతున్నారే తప్పా చర్యలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదని ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాలను విస్మరించి అక్రమార్కులకు అనుకూలంగా డిజైన్ చేసి చకచకా పనులు సాగించడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. భారీ వర్షాలు కురిసి నీరు ఇళ్లల్లోకి వస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో జోనల్ కమిషనర్ శేషాద్రి సైతం చేతులు ఎత్తేస్తున్నారు. ఇలా అధికారులు అంతా ఎవరికి వారు తప్పించుకొనే ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా చూడడంతోపాటు నిర్మాణాలు ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు. జీవీఎంసీ కమిషనర్ బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ స్వయంగా గెడ్డ నిర్మాణ పనులు పరిశీలించి ఆక్రమణలు తొలగించి, భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సువిశాలంగా గెడ్డ నిర్మాణ పనులు పూర్తి చేయించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఆక్రమణలు తొలగించాలని ప్రణాళికా విభాగానికి రాసిన లేఖ



పొంగిపొర్లుతున్న గెడ్డ (ఫైల్)

నాకు అధికారం లేదు



నేను కేవలం పరిపాలనకు సంబంధించిన పనులు మాత్రమే పర్యవేక్షిస్తాను. ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్ విభాగంపై అజమాయిషీ చేయడానికి నాకు అధికారం లేదు. ఆయా విభాగాలకు అధిపతులు ప్రధాన కార్యాలయాల్లోనే ఉంటారు. సమస్య ఉంటే వారి దృష్టికే తీసుకువెళ్లాలి. నేను ఏమీ చేయలేను.

– శేషాద్రి, జోనల్ కమిషనర్, గాజువాక

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న లక్ష్మి

పెదగంట్యాడ: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రోగ్రాం మేనేజర్ లక్ష్మి అన్నారు. సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మహిళలు, చిన్నారుల పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తక్కువ ధరలకు లభ్యమయ్యే ఆకుకూరలు, పప్పుదినుసుల్లోనే కావాల్సిన పౌష్టికాహారం లభిస్తుందని చెప్పారు. రక్త హీనతను అధిగమించడానికి తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత,అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని జూబిలీహిల్స్ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వినాయక ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఎంసెట్ హాల్‌టికెట్లతో వినాయకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు విద్యార్థుల పేరుతో అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచినీటి నిల్వల్లోనే డెంగ్యూ దోమలు



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్‌బాబు, వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: దోమల కారణంగా డెంగ్యూ వస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె రమేష్‌బాబు సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచినీటి నిల్వల్లోనే డెంగ్యూ కారక దోమలు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలని కోరారు. ఆ రోజు ఇంటి అవసరాలకు మినహా మిగిలిన నీటి పాత్రలను ఆరబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, సిబ్బంది చిత్తాడ సత్యనారాయణ, శేషయ్య, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గాజువాక పీహెచ్‌సీ సిబ్బంది

డెంగ్యూపై అవగాహన ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: డెంగ్యూ జ్వరాలను మందుస్తుగా గుర్తిస్తే మరణాలను నివారించవచ్చని గాజువాక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సుధాకర్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది చినగంట్యాడ వరకు ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో డెంగ్యూ జ్వరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జ్వరం వచ్చిన తర్వాత తగ్గక పోతే పీహెచ్‌సీకు వచ్చి డెంగ్యూ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌వో పి.నాగప్పారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం థీమ్ పరిశీలించండి – శుభ్రం చేయండి – మూతలు పెట్టండి అన్నారు. దోమల వ్యాప్తికి కారకాలైన పూలకుండీలు, ఫ్రిజ్‌లు, కొబ్బరి బోండాలు, మనీ ప్లాంట్ వంటి వాటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎస్ జి.రాము, హెచ్‌వీ రత్నాలు, సూపర్‌వైజర్లు సురేష్, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మూడో రోజు 'లయన్స్' సేవలు



రైలు ప్రయాణికులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సాధారణ బోగీల ప్రయాణికులకు మూడో రోజు కూడా కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మినరల్ లీటర్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. శుక్రవారం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్, మహిళా, దివ్యాంగుల బోగీల ప్రయాణికులు వీటిని ఉచితంగా అందించారు. కూర్మన్నపాలెం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లయన్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి రోజుకు 250 వాటర్ బాటిళ్ల చొప్పున పంపిణీ చేశామన్నారు. క్లబ్ ప్రతినిధులంతా ఎండను లెక్కచేయకుండా వచ్చి రైలు ప్రయాణికులకు వాటర్ బాటిళ్ల సరఫరాలో పాల్గొన్నారన్నారు. జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, మానవ వికాస వేదిక ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్ మూర్తి, లయన్స్ జిల్లా గరవ్నర్ సుబ్బరాజు, వివిధ సంఘాల ప్రతినిధులు సీతారామరాజు, రామరాజు, లక్ష్మణరాజు, శివరామరాజు, బుచ్చిరాజు, ఆదిల్ రెహ్మాన్, పి.శ్రీనివాస్, హిమజ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


• సీపీ శంఖబ్రత బాగ్చి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అక్కిరెడ్డిపాలెం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గాజువాక సెలస్ట్ గేటెడ్ కమ్యూనిటీలో శుక్రవారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సైబర్ నేరాల వల్ల పౌరులు ఎలా నష్టపోతున్నారు... నేరాలను ఎలా అరికట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు.దేశంలో దారిదోపిడీ, హౌస్ బ్రేకింగ్ వంటి నేరాల్లో రూ.80 కోట్లు తస్కరిస్తే... సైబర్ నేరాల్లో రూ.220 కోట్లకు పైగా నేరగాళ్లు తస్కరించారన్నారు. పెహల్గాం ఘటన తర్వాత పాకిస్తాన్ హ్యాకర్స్ ఇండియన్ వెబ్ సైట్లను హ్యాక్ చేశారన్నారు. గాజువాక సీఐకు నగర పోలీస్ కమిషనర్ డబ్బులు అడుగుతున్నట్టు మెసేజ్ వచ్చిందన్నారు. సీఐ ఫోన్ చేయడంతో అసలు విషయం బయట పడిందన్నారు. కస్టమర్ కేర్ ఫ్రాడ్, యూపీఐ లాటరీ, జాబ్ కేవైసీ ఫ్రాడ్‌లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్ ఫ్రాడ్ వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్లను విజిట్ చేస్తే సైబర్ నేరగాళ్లు కనిపెడుతూనే ఉంటారని.. అలాంటి వారిని డిజిటల్ అరెస్ట్ పేరిట బయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తారని వివరించారు. ఎవరు భయపడకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే 1930కు ఫోన్ చేస్తే వారి బారి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ– 2 మేరీ ప్రశాంతి, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి, క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవికుమార్, సెలస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగుల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



దివ్యాంగులతో కరణంరెడ్డి నర్సింగరావు, రమణారెడ్డి

పెదగంట్యాడ: దివ్యాంగుల్లో ఉన్న ఆసక్తిని గుర్తించి వారికి ఆయా రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కల్చర్ ఫౌండేషన్ కృషి చేస్తుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, తిప్పల రమణారెడ్డి అన్నారు. కల్చర్ ఫౌండేషన్ చైర్మన్ పేర్ల అప్పారావు ఆధ్వర్యంలో గొడ్డువానిపాలెంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 మంది దివ్యాంగులకు 45 రోజుల పాటు కంప్యూటర్ కోర్సు, ఆఫీస్ అసిస్టెంట్, వృత్తి విద్యలో శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీలకర్ర రమణ, భువనేశ్వరి, ప్రకాష్, గిరి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కేవీ విద్యార్థులకు పతకాల పంట



పతకాలు సాధించిన కేవీ విద్యార్థులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ) విద్యార్థులు రీజనల్ అథ్లెటిక్స్ పోటీల్లో పలు పతకాలు గెలుపొందారు. ఇటీవల హైదరాబాద్‌లోని గోల్కొండ కేవీ-2లో 54వ కేవి ప్రాంతీయ అథ్లెటిక్ మీట్ జరిగింది. ఈ పోటీల్లో పాల్గొన్న పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఎం. కార్తికేయ సాయి100 మీటర్ల పరుగు, 110 మీటర్ల హర్డిల్స్, 400 మీటర్ల హర్డిల్స్, 400 మీటర్ల రిలే పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించాడు. అదే విధంగా 100 మీటర్ల రిలే పోటీల్లో రజత పతకం కూడా సాధించాడు. 8వ తరగతి విద్యార్థి బి. మోహన్‌కాంత్ 400 మీటర్ల రిలే పోటీలో బంగారు పతకం , 800 మీటర్ల పరుగు పోటీలు, 100 మీటర్ల రిలే పోటీల్లో రజత పతకాలు, హై జంప్ పోటీలో కాంస్య పతకం గెలుపొందాడు. 9వ తరగతి విద్యార్థి సాయి కిరణ్ 400 మీటర్ల రిలే పోటీల్లో బంగారు పతకం, 100 మీటర్ల రిలే పోటీల్లో రజత పతకం, డిస్కస్ త్రోలో కాంస్య పతకం సాధించాడు. 10వ తరగతి విద్యార్థి పి. లక్షిత సూర్య 400 మీటర్ల రిలే పోటీలో బంగారు పతకం, 100 మీటర్ల రిలే పోటీలో కాంస్య పతకం గెలుపొందాడు. అదే విధంగా 12వ తరగతి విద్యార్థి కె. భార్గవ్ తేజ 400 మీటర్ల పరుగు, ట్రిపుల్ జంప్‌లో రెండు బంగారు పతకాలు, లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా విజేతలతో పీఈటీ కె.వి.సత్యనారాయణను శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ అభినందించారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరవు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిటీ ప్లానర్ ధనుంజయ్‌రెడ్డి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు స్పందన కరువైంది. సోమవారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నా అధికారులు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శల నేపథ్యంలో ఓపెన్ ఫోరమ్‌కు కూడా ఎవరూ పెద్దగా రాలేదు. కేవలం 4 వినతులు మాత్రం వచ్చాయి. ఈ వినతులను జీవీఎంసీ సిటీ ప్లానర్ కె.ధనుంజయ్‌రెడ్డి స్వీకరించారు.

రుచి+చల్లదనం=తాటి ముంజలు



పెదగంట్యాడ కూడలిలో తాటి ముంజలు తీస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: భానుడి భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అయితే, పూట గడవని కొందరు మాత్రం తప్పక పని చేయాల్సి వస్తోంది. విజయనగరం జిల్లాకు చెందిన కొన్ని కుటుంబాలు మండుటెండను లెక్కచేయకుండా గాజువాక ప్రాంతంలో రోడ్లపై తాటి ముంజలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాయి. వేసవిలో తాటి ముంజలకు మంచి డిమాండ్ ఉంటుంది. వీటిలో పోషకాలు అధికంగా ఉండటమే కాకుండా, శరీరానికి చలువ చేసే గుణాలు కూడా ఉంటాయి. అందుకే వీటిని కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. ప్రతి సంవత్సరం వేసవిలో విజయనగరం జిల్లాలోని శృంగవరపు కోట, లక్కవరపు కోట ప్రాంతాల నుండి అనేక కుటుంబాలు గాజువాకకు వలస వస్తారు. చుట్టుపక్కల ప్రాంతాలైన పెదగంట్యాడ, నెల్లిముక్కు, దువ్వాడ మొదలైన చోట్ల తాటిచెట్ల నుండి కాయలు సేకరించి గాజువాక మరియు దాని పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత



బాలగణేష్‌రెడ్డిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ

అల్లిపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన వ్యక్తిని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలిలా.. అల్లిపురం కుమ్మర వీధికి చెందిన చాట్ల బాలగణేష్‌రెడ్డి ఈ నెల 12న కుటుంబంలో కలహాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు అతడి తండ్రి చాట్ల వెంకటరమణ, సోదరుడు చాట్ల సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస రెడ్డి సాంకేతికను ఉపయోగించి గాజువాక పరిసర ప్రాంతాల్లో గణేష్‌రెడ్డి ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం అతడిని టూ టౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సమక్షంలో తండ్రి, సోదరుడికి అప్పగించారు.